# నే చేసింది తప్పా?

శ్రీ పీసా లక్ష్మణరావు

[ ఇప్పుడు నే చెప్పబోతున్నది నా జీవితములో జరిగిన యదార్థసంఘటన. నా స్వేచ్ఛకు, నా జీవయాత్రకు ఎన్నో అగాధాలు ఆటంకాలు వచ్చాయి. వీటన్నిటమధ్య యిరుక్కుపోయి జీవితాన్నే చాలిద్దామనుకున్నాను. ఆలోచించాను. తప్పు అనుకున్నాను. నాకు మటుకు నలుగురిలాంటి సంతోషము, సౌఖ్యము, ఎందుకు సమకూడవుఅనుకున్నాను. ఈపనిచేశాను. నేననుకున్నవి సమకూడాయి. కాని, ఈలోకము నన్ను తిట్టిపోస్తుంది. మళ్ళీచేసింది తప్పా? అనే ఆలోచనలోనికి దిగాను. నాయందు దయవుంచి మీరుకూడా ఆలోచించండి. నేచేసింది తప్పేమో నిర్ణయించండి. శ్రమయిచ్చినందుక్కు క్షమించండి. ]

అవి నాకు గుర్తుతెలియని దినాలు. ఒంటిమీద గుడ్డకూడా కానకుండా వీధులలో తిరిగేదానను. బొమ్మరిండ్లు కట్టుకొని చప్పట్లు వాయించుకుంటూ గంతులేశే దానను. ఆరోజులలో ఈఎండ, వానలు నన్నేమి చెయ్యలేక పోయేవి. యింకా ఎన్నెన్నో ఘన కార్యాలు చేశాను. అదంతా చిన్నతనము. ఒక నాడు మాయింటికి సున్నాలేస్తున్నారు. ఆడంగులు పసుపు, కారము వగయిరాలు మామూలుకంటె విరివిగా తయారు చేస్తున్నారు. ఇవన్ని ఎందుకు తయారుచేస్తున్నారో నాకు తెలియదు. తెలుసుకుందామని బుద్ధి పుట్టింది. పసుపు దంచుతున్న మావదిన దగ్గరకుపోయి, "ఇవన్నీ ఎందుకు వదినెయ్యా" అని అడిగాను. ఆవిడ నవ్వుతుంది. అంతటితో వూరుకోలేదు. నాకు సమాధానము చెప్పాలి అని ఆమెకూ సర్దాగానే వుంది. "ఎందు కేమిటి? నీ కోసమే. నీకు పెళ్ళి" అంటూ నవ్వుకుంటుంది. నా కామాటేమిటో తెలియలేదు. నవ్వొచ్చేమాట కావాలి అనుకున్నాను. నేనూ నవ్వేను ఆవిడతో కలసి. "చూశారా! పెళ్ళంటే. ఇంతపిల్లకు కూడా ఎంత ఉల్లాసమో? అంది వదినెయ్య నవ్వుకుంటూ ప్రక్కనున్న వాళ్లతో.

ఇలా మేము అనుకొని ఎన్నోరోజులు కాలేదు. నాకు క్రొత్తబట్టలు కట్టి, నగలు పెట్టి శృంగారించారు. నా సర్దావాది. ఇంట్లో వండుతున్న పప్పులు పాయిసాలు పట్టుకొని నా జట్టుకు పంచటానికి బయల్దేరాను. మాయమ్మ ముక్కుమీద వ్రేలువేసికొని "తప్పు తల్లీ! బయటికి పోకూడదు! అంటూ ఇంట్లోకి లాక్కుపోయింది. ఆమరునాటి రాత్రే అనుకుంటాను. ఒకబ్బాయిని నన్నూ కలిపి బల్లలుమీద కూర్చోబెట్టారు. నా కోక కొంగు అతని కండువా చెంగు కలిపి ముడివేశారు మాచుట్టూ వెండిమీసాల వాళ్ళు, బట్టతలల వాళ్లు చాలామంది వున్నారు. జంధ్యపు పోగులవాళ్లదే హడావిడి అంతాను. ఒక పౌరోహితుడు చెప్పగా లేచి నాకోక చెంగుతో ముడివేసుకున్నా యన నా మెడ కొక దారము కట్టేడు. బాజా భజంత్రీలతోనే. మాయిద్దరిని పల్లకిలో కూర్చుండబెట్టి వూరంతా త్రిప్పి తీసికొచ్చారు. ఇదంతా చూస్తుంటే ఎంతో నా కానందము ఉండేది.

పదేళ్ల ప్రాయము. మూడో తరగతివరకు చదివాను. అప్పుడు నా మెడకు దారముకట్టిన యువకుడు నాభర్త అని తెలిసికోగలిగాను. సంక్రాంతి పండుగ నాభర్తను మాయింటికి ఆహ్వానించారు. చూస్తును గదా ఆసుందరుని. బంగారు ఛాయ ముప్పైఏళ్ళుంటాయి. గుండ్రని మొగము. బొమ్మలా కనిపించేడు. అయినా ఆతన్ని చూస్తే నాకు భయమేశేది. ఆతని కళేభరము ముందు నేనొక పిల్లిలావుండే దాన్ని ఒకందుకు సిగ్గు అనిపించేది. మాయింటి చుట్టుప్రక్కల వాళ్లయితేనేమి మాయింట్లో వాళ్ళయితే నేమి వరసవచ్చిన వాళ్ళందరు నన్ను హేళన చేసేవారు. అలాంటప్పుడు భర్తముందు పడితినా వాళ్లునన్ను ఉడికించి చంపుతారు. అందుకని అతనింట్లో ఉన్నంతసేపూ నేనువదో మారు మూలను దాగి ఉండేదాన్ని. వారుకూడానన్ను చూడాలన్న తాపత్రయము ఎక్కడా కనబర్చేవారు

కాదు. అలా అయినట్లయితే వాళ్లతో నన్ను గూర్చి ముచ్చటించే ఉండేవారు. (ఇది నేను తరువాత గ్రహించినమాట) పండుగ మూడురోజులువుండి మావాళ్ల యిచ్చిన కట్నాలు కానుకలు పట్టుక పోయినారు.

ఆదినము నాకు బాగా గుర్తుంది. ఆదివారము నాన్నవాళ్లు ఇంటిదగ్గరే ఉన్నారు. ఒక మనిషి ఆత్రుతతో మాయింట ప్రవేశించాడు. మానాన్న వచ్చి ఆతన్ని సముదాయించి విషయము తెలిసికున్నారు. వెంటనే మాయన్నయ్య నతనికి తోడుగా యిచ్చి పంపించారు. ఆతరువాత నాన్న అమ్మతో చెప్పినమాటలు: "అల్లుడు, ఎవరో ఆడమనిషిని తీసికొని పలాయనమయినాడట. ఒకవేళ మనకు వినికిడి అయిన ప్రదేశాలలో వున్నాడేమోనని ఈమనిషిని పంపేరు వాళ్ళ నాన్న. మన అబ్బాయిని కూడా తోడిచ్చి పంపేను. ఏమో ఎలావుంటుందో తెలియదు." కొన్ని రోజులు మాయన్నయ్యవాళ్లు ఒక గ్రామములో నా భర్తను కలిసికొన్నారు. తిరుగ మా యన్నయ్య వక్కడే మాయిల్లు చేరుకున్నాడు. నాన్నకు అమ్మకు దగ్గరగా కూర్చొని "చాలా గ్రామాలు తిరిగేము ఎలా అయితేనేమి దైవవశాత్తు కనబడ్డాడు. ఆ అమ్మాయిని విడచి రమ్మని వాదించేము. అందుకు "రాను. ఈమెతో కలిసి కాపరం వెలిగించాలన్న వుద్దేశంతోనే యిలా లేచివచ్చేశాను. ఇప్పుడామెను విడచి పెట్టడము కలలోని మాట." అన్నాడు. "అయితే మా అమ్మాయి సంగతి" అని నేనడిగాను. "నేనూ ఉప్పు పులుసు తింటున్నాను. కామేచ్ఛ అనేది నాకూ ఉంది. ఇప్పుడు మించింది ఏమీలేదు. మీయమ్మాయి చిన్నది. తరువాత ఆలోచించుకోవచ్చును" అన్నాడు. తరువాత చాలా చెప్పేను. చేశేదేమీ లేకే వచ్చేశాను. అని మా అన్నయ్యవాళ్లతో చెప్పాడు.

ఇప్పుడు నేను పెళ్లంటే ఎందుకో తెలుసుకొన్నాను. భర్తఅంటే ఎవరో వూహించుకున్నాను. ఆ భర్తకోసము, ఆతనివలన లభించే ఆనందముకోసము ఆత్రుతతో ఎదురు చూస్తున్నాను. మావాళ్లు "మా అమ్మాయి రజస్వల అయి ఆరుమాసాలయింది. అయిదు రోజులలో గర్భాధాన ముహూర్తము నిశ్చయించాము. సరంజాం అంతా ఆయత్తపరిచాము." నీకోసము మావాళ్లు ఎదురు చూస్తున్నారు అని వారితో చెప్పమని అన్నయ్యతో చెప్పి పంపేరు. నా భర్త కూడా బాగా చదువుకున్నవాడే. ఆమెకు అతనికి అంత అన్యోన్యముగా ఉండేటప్పుడు వీళ్లమాటలు ఎలా విన్నాడో తెలియదు. నన్ను చవిజూచి చావగొడదామని ఆతని ఉద్దేశమేమో. బావమరదులు యిద్దరూ ఇల్లు చేరుకున్నారు. ఆకార్యము కాస్తా పెద్దల ఆశీర్వచనాలతో జయప్రదంగా సాగిపోయింది. ఆ మూడోనాడు "ఆవిడతో చెప్పకుండా వెళ్ళిపోవచ్చాను. ఆమె చాలా చింతపడుతుంది. నేను యివ్వాళే ప్రయాణ మవుతాను" అన్నారు నా భర్త "మళ్లీ ఎప్పుడొస్తారు?" అని నేనన్నాను. ఏమో చెప్పలేను" అన్నారు "చెప్పలేక పోవటము కాదు. ఇక వచ్చేవన్నీ మనము ఉమ్మడిగా బ్రతకవలసిన రోజులు" అన్నాను నవ్వుకుంటూ నాకూ తెలుసును. ఆ ఏర్పాట్లు త్వరలోనే జరిగిస్తాను. నువ్వు చింతపడకు అన్నారు. ఈతుది మాటే మానాన్నగారితో చెప్పేరు మూటముల్లె సర్దుకున్నారు.

ఇది మూడో సంవత్సరము. వారిరాక లేదు. ఎన్నో వుత్తరాలు, ఎన్నోకబుర్లు వెళ్లాయి రమ్మనమని. క్రియశూన్యము నాకూ ఆత్రుత మెండుగానే వుంది. నానిరీక్షణ మానాన్న గ్రహించారు. స్వయంగా బయలుదేరారు. వారికీ వారికి తర్జన భర్జనలు జరిగాయి. ఆపయిని నాభర్త "ఇక్కడ మా యిద్దరము ఎంతో ఆనందాన్ని అనుభవిస్తున్నాము. రోజులు గడచిన కొలది మాయిద్దరి మధ్య తీరని అభిమానము, వీడని లంకె ఏర్పడుతున్నాయి. ఇలాంటి అవకాశాన్ని కాల్తంతే మరి నాకు శాంతివుండదు అంతటితో నా జీవితము అంతమే అంటున్నానని కోపము తెచ్చుకో మాకండి. అది నాహృదయ పూర్వకముగా అంటున్నమాట. మీయమ్మాయిని వేరొకరికి యిచ్చి పెండ్లి జరిపించండి నన్ను క్షమించాలి. అని సమాధానము చెపుతూ తల వాలేశారట అన్ని విధాల ప్రయత్నించారు. మానాన్న వార్ని రప్పించటానికి కాని లాభములేక పోయింది. విఫల మనోరథుడై మానాన్న యిల్లు చేరాడు. చాలా మంది మనోవర్తికి దావా వెయ్యమన్నారు. "పోనీ! ఆ వెధవ ప్రస్తావమే ఇక మాకవసరము లేదు ముష్టిసొమ్ము వాడి దెవడికి కావాలి ఉంచుకున్న ముండ ఎన్నిరోజులుంటుంది? ఆతరువాత వాడే చేరుతాడు." అన్నారు మానాన్నగారు కాని మాయమ్మ అంగీకరించ లేదు. "వాడితో సంబంధమే త్రెంచుకున్న తరువాత వాడి

కోపము మనం నిరీక్షించే దేమిటి? మనోవర్తి దావా వెయ్యండి. లేదా అమ్మాయికి పెళ్లి ప్రయత్నము చెయ్యండి." అంది కోపముతో వారి రెంటిలో ఏదీ అంగీకరించినటుల కనబడలేదు.

భర్త పరనారి ప్రేమకోసరము గ్రామాంతర వాసి. నేనిప్పుడొక వితంతుతోయముగా వుండాల్చి వచ్చింది. పదిమంది పదిమాటలాడుతూ వుండేవాళ్లు వీళ్లందరు ఇలా అంటుండడము మూలాన్నో ఎందుకో అనాటి కానాటికి భర్తఅనే ఆశ ఎక్కువయింది: మా యమ్మతో చెప్పాను రహస్యంగా "నాభర్త సన్నిదానమున నన్నుంచడము మంచిది" అని వాళ్ళందుకు ఒప్పుకోలే. నాభర్తకు మావాళ్లకు తెలియకుండా వుత్తరము వ్రాశాను అందుకు సమాధానము సున్న. అయినా ఓపిక పట్టడము మంచిదనుకున్నాను. మాయమ్మ ఒకటి రెండు కుటుంబాల వాళ్లని అడిగి చూసింది. అందుకు వాళ్లు "ఈరోజులలో బాల వితంతువులను కట్టుకోడమే నగుబాటుగావుంది. అలాంటప్పుడు భర్తతో అనుభవించిన నీకూతుర్ని చేసుకోవడము కష్టము పెళ్లయితే మానే కార్యమయినా కాకుండావుంటే పెళ్లికి ఎవరయినా అంగీకరించి ఉండేవాళ్లేమో" అన్నారు. బాల వితంతువు కాటానికి కార్యమయింది. పెద్ద వితంతువు కావటానికి భర్తవున్నాడు. ఈరెండు నామాటలు మనువుకు అడ్డువచ్చాయి. అయినా నేను యితర వాంఛలు పెట్టుకోలేదు. నిర్మలంగానే వున్నాను నాభర్త పరివర్తన కోసరము ఎదురు చూస్తున్నాను. అయితే నేనిల్లు కదల[illegible]ము భయంగావుంది. పదిమంది గుసగుసలాడేవాళ్లు ఎన్నో తలలు నన్నుచూసి పెదవులు విరిచేయి. నాగుణము మంచిది కాదనే నాభర్త నన్ను విడచి పెట్టేడు అని నిందమోపారు. ఇలా నేను సహించలే నన్నిమాటలు వింటున్నాను. వీళ్లందరూ ఇలా అని మరచిన కామవాంఛను ప్రేరేపించారు. అయినా నేను తొందర [illegible]లేదు. మాయింటి వాళ్ళకు కూడా నా మీ[illegible] అనుమానము కలిగిందేమో నన్ను అసహ్యముగా చూట్టము మొదలు పెట్టారు అవన్నీ వ్రాస్తే పేజీల తరబడి కావాలి మీకు విసుగుకూడా కలుగుతుంది ఏకొక్కటో చెప్పి మానుతాను.

అది ఉదయము తొమ్మిది గంటల సమయము. మాయమ్మ స్నానముచేస్తుంది, మావదినె నీళ్ళకు వెళ్ళింది ఒక వ్యక్తి గుమ్మందగ్గిర నిల్చున్నాడు. నాకు భయము విభ్రాంతి రెండు సంభవించాయి అతనేదో మాట్లాడబోతున్నాడు, చటాలున "ఎందుకండి; అలా నిలబడి చూస్తున్నారు" అన్నాను ఆతృతతో. "ఏమీలేదమ్మా! మా అబ్బాయికి మాడున ఆముదపు ఆకుతో పట్టు వెయ్యాల్చి వుంది. అవి మీదొడ్లో వున్నాయి కదూ. అడుగుదామని వచ్చాను. ఎవరన్నా బయటికివస్తే అడుగుదామని చూస్తున్న" అన్నాడు. నాభయాన్ని బాపుకొని దొడ్లోకిపోయి నాలుగాకులు కోసి వీధి గుమ్మం దగ్గిర నిల్చున్న ఆతని చేతిలో పెట్టేను. అతను పయనమయినాడు. ఎవరో రావటము ఆతనిచేతిలో నేనేదో పెట్టడము ఇంచుక దూరములోవున్న అన్నయ్య చూశాడు. ఇంట్లోకి వచ్చిందే తరువాత నన్ను పిల్చాడు నాకేం తెలియదుగా? నేనునిర్భయముగా వెళ్లేను. పిసరంతయినా భయము నాముఖాన కనబడక పోవడము ఆతనికి కోపము ఉద్రేకించింది. పెడేలుమని ఒక చెంపకాయ దవడ మీద మ్రోగింది. ఇంత తొందర పడటానికి కారణము ఇంతకు ముందు నన్నుగురించిన పిచ్చి మాటలు ఏవో వినివుంటాడు. ఆనాడు నాకన్నీటితో జాకెట్టు స్నానము చేసింది. ఆవేదనతో గుండెభారమై తోచింది మనసు పరిపరి విధాల పరుగెత్తింది.

ఇప్పుడు నేను సుఖముగా వున్నాను. అతడు నామీద ఆజన్మాంతము మరువరాని అభిమానము చూపిస్తున్నాడు. నేవాంచించిన సంతోషము, సౌఖ్యము ఇంత చేరువలో వున్నట్లు నాకేనాడు తెలియదు ఇప్పుడు నాతల్లిదండ్రులను విడిచానన్న దుఃఖాన్ని అంకురమనేదే లేకుండ చేశాను. ఇందుకు కారణము వైరెండే. కాని లోకము నన్ను తిడుతుంది. నేచేసింది వ్యభిచారమట. నేను కులటనట. అయితే నేను వేరొకనితో కాపరము చేస్తున్నమాట నిజమే. మరి నన్ను పెళ్ళిచేసికొన్న భర్త అంగీకరించలేదు. మాయింట్లో వాళ్లు పశువులు. వాళ్లాంటి కోరికలు యితరులకుంటాయని వాళ్ళను కోరు. ఈరెంటి మధ్య యిరుక్కొని నేనుచావడము మంచిదా? నా స్వేచ్ఛ నా స్వాతంత్ర్యము వీళ్ళమీదే ఆధారపడి వున్నాయా? నేను నాకు నచ్చిన ఒక పురుషునితో ఆనందంగా, గుప్తంగా నాజీవయాత్రను నడపటము తప్పా? అది వ్యభిచారమా? మీరే నిర్ణయించండి.